# అల్లుడుగోరు

**-అంజి. నందిగం**

ఆరుగంటల బస్సు ఊళ్ళోకి వచ్చింది.

బస్సులోనుండి శంకరం, అతని భార్య గాయత్రి దిగారు.

మంచుపొగలు దట్టంగా కురుస్తున్నాయి. బస్సు రావడానికే దారి కనబడక బోల్డంత లేటయ్యింది. ఎటుకేసి చూసినా తెల్లటి పొగ పొరలే తప్ప ఏమి కన్పించట్లేదు. శీతలగాలి మంచుతో కలగలిపి విసురుతుంటె ఒళ్ళంతా జివ్వుమని ఒణికిపోతోంది. కాసేపు ఆ చలిలోనే ఓపిక పట్టి ఎదురు చూశారు. గాయత్రి తండ్రి రామయ్య రావట్లేదు. ఇక అనవసరమనుకొని నడక ప్రారంభించారు.

''మీ నాన్నని నమ్మి యింత సేపు టైం వేస్ట్ చేయడం మన తప్పు'' అన్నాడు శంకరం.

''మనమే యింతగా ఒణికిపోతున్నామే, పెద్దాయన ఆయన ఆరోగ్యం చూసుకోవద్దాండీ'' నిర్లిప్తంగా అంది గాయత్రి.

''పోనీ..మీ బుడంకాయ్ వెంకిగాడినైనా పంపొచ్చుగా!''

''వాడు అసలే కోతి. మాట విని చావడు''

''నువ్వు నా మాట వింటున్నావా ఏంటి? వాడు మీ మాట వింటానికి? సిల్లీగా అన్నాడు.

''నేను మీ మాట ఏం విన్లేదండి?'' మూతి ముడుచుకుంది.

''ఆఫీసుకు శెలవు పెడ్తానంటే ఊరుకుంటివా?''

''కారణం లేకుండా శెలవు పెడ్తానంటే ఎవరు మాత్రం ఊరుకుంటారండి''

''నేను పెట్టేది నీకోసం'' అంటూ భుజం మీద చేయి వేశాడు శంకరం.

''ఇది పబ్లిక్ రోడ్డు ఎవరన్నా చూశారంటే నవ్విపోతారు'' విసురుగా చేయి త్రోసిపుచ్చి.

''రాత్రులెలాగో నిద్రవుంచరు. పగలు కూడా అదే పనైతే పడుకునే దెప్పుడండి?'' వయ్యారంగా శృంగారపు సిగ్గును పెదవుల మీద చిందించింది.

''పడుకోవటం ఎప్పుడైనా పడుకోవచ్చులే... ఈ మూడు వచ్చినప్పుడు కాదన్నావనుకో ఏ మగాడికైనా ఎంత కోపం వస్తుందో మీ ఆడోళ్ళకు చెప్పినా అర్థం కాదు''

''మాకు అంతేనండి. మా నిద్ర చెడగొట్టి మీ అవసరాలు తీర్చుకుంటామంటే..మా ఆడాళ్ళకు ఎంత కోపం వస్తుందో మీ మగాళ్ళకు చెప్పినా అర్థం కాదు'' బదులిచ్చింది.

''ఏంటీ..మీ ఊరొచ్చాననా తెగ ఎదురు చెప్తున్నావు''

''మీరు అడిగే వాటికేగా చెప్పింది''

మోడల్ గేమ్‌లా శంకరం, గాయత్రి మధ్య మాట మాట మెట్లు కడుతుండగా పరుగులాంటి నడకతో ప్రత్యక్షమయ్యాడు వాళ్ళ ముందు రామయ్య.

తువ్వాలు తలకు చుట్టేశాడు. జానెడు బారున చుట్ట నోట్లో బిగించాడు.

గుప్..గుప్..మంటూ పొగవదుల్తున్నాడు దర్జాగా.

''ఏంటి నాన్నా యింత మంచులో రాకపోతే ఏం?'' అంది

''అన్నమాట పెకారం మాట నిలబెట్టుకోవాలంతే..''

''దగ్గర్లో కొచ్చాక మీ మాట ఏం నిలబడ్తుంది మావగారూ'' ఎగతాళి చేశాడు శంకరం.

''మీకన్నా బెటరేలెండి'' మూతి వంకర్లు తిప్పింది.


''పోన్లేమ్మా! అల్లుడు గోరు నాతో పరాచకాలాడుతున్నారు. సూడు అల్లుడుగోరూ..శివాలయం గుడి దాటాల..అక్కడ్నించి పక్క మలుపు తిరిగితే గాని మనిల్లు సేరం. కాబట్టి నా మాట నిలబడుద్ది అల్లుడుగోరూ'' విడమర్చి చెప్పాడు.


శివాలయం వీధి వేపు నడక సాగింది.

శివాలయం గోపురం మొత్తం ఐస్ గడ్డలతో కట్టినట్టుగా కనబడుతున్నది. గోపురపు ఆకారం పూర్తిగా మారిపోయింది. గోపురం పైన స్పీకర్లో భగవద్గీత వారి చెవుల్లో దూరి




సంతృప్తిని కలుగజేస్తోంది. పావురాలు కువ కువ ధ్వనులతో గుడి చుట్టూరా రౌండ్స్ కొడుతున్నాయి. అప్పటికే కొంతమంది






భక్తులు దర్శనంకోసం వరసలు కడుతూ కన్పించారు.

''అల్లుడుగోరు ఇదే మన శివాలయం''

''కన్పిస్తూనే వుంది''

''అట్టాకాదుగా..కొత్తలో సిగ్గడి బయటకు రావాలంటేనే జడ్సేవోడివి. ఇప్పుడు మీకు పెళ్ళయి ఒక ఏడాది కావోస్తోంది. అందుకే గేపముందో లేదోనని సూపిత్తన్నాను.''

పక్క వీధి తిరగ్గానే కూతురు, అల్లుడ్ని చూసి సీత నీళ్ళ చెంబుతో ఎదురొచ్చింది.

''అమ్మా! బాగున్నావా?'' ఆప్యాయంగా అడిగింది

''బానే వున్నానమ్మా'' అంటూ కాళ్ళు కడుక్కుంది గాయత్రి.

''అత్తగారు బాగున్నారా?'' తను కూడా కాళ్ళు కడుకున్నాడు శంకరం.

''బానే వున్నాను బాబు'' అంది.

లోనికి వెళ్ళాక బట్టలు మార్చుకున్నాడు శంకరం. గాయత్రి కూడా బట్టలు మార్చుకుని...

''...ఏవండి స్నానం చేస్తారా?''

''చేయను. నిన్ను వాటేసుకుంటాను'' అంటూ ఆమె దగ్గరగా రాబోయాడు.

గాయత్రి గభాలున గుమ్మం బయటకు వెళ్ళిపోయింది.

మంచం మీద పడుకుని గురకపెడ్తున్న బావమరిది వెంకిని చూసి-

''ఒరేయ్ బామర్దీ..లేవరా!'' భుజాలు కుదిపాడు.

కళ్ళు విప్పి బద్ధకంగా ఒళ్ళు విరగదీసుకుంటూ ''ఎవరది?'' అన్నాడు.

''నేన్రా..నీ బావని''

''ఎప్పుడొచ్చావ్ బావా?''

''ఒకసారి కళ్ళు తెరవరా''

''నేను తెరిచే వుంచాను. నువ్వే అటెటో చూస్తున్నావు''

బయట నుండి గాయత్రి కేకేసింది.

''వెంకీ''

''వెళ్ళి మీ బావగార్ని రమ్మను''

''అట్లాగే''

తలుపు వద్దకొచ్చి ''బావా! అక్క రమ్మంటోంది'' చెప్పాడు వెంకి.

''మీ అక్కనే రమ్మను ఒసారి''

బావి వద్దకు మరోసారెళ్ళి ''అక్కా నిన్నే రమ్మంటున్నాడు''

''సర్లే నువెళ్ళు''

పనిపాటుండదని సణుగుకుంటూ ''ఏంటండి పిలిచారట'' గుమ్మం వద్దే నుంచుని అడిగింది.

''లోనికి రావోయ్''

''అక్కర్లేదు చెప్పండి''

''వస్తావా.....'' మొహంలో ఫీలింగ్స్ మారుస్తూ అన్నాడు.

''వస్తున్నాను'' అంటూ దగ్గరగా వెళ్ళింది.

గభాలున ఆమెను గట్టిగా తన కౌగిలిలో బిగించి చిన్నగా ముద్దాడామనుకున్న ఆమె పెదవుల్ని తన పెదాలతో గప్‌చుప్‌గా మూసేశారు. పాలకంకిల్లా పదునుమీదున్న ఆమె బుగ్గల్ని బలవంతంగా పళ్ళతో గాట్లు పెట్టసాగాడు.

''ప్చ్! వదలండి..ఎవరన్నా వస్తారు'' అంటూ అతని కౌగిలి నుండి బంధ విముక్తురాలవడానికి అన్ని విధాల కృషి చేస్తోంది.


ఆమె వాదన కొట్టిపారేసి శృతిమించిన ప్రవర్తనతో హద్దుమీరబోయేలోపు తను అటూ యిటూ గింజుకులాడి అతన్ని పక్కకు నెట్టి బయటకు పరుగెట్టింది.

ఎంత భార్యాభర్తలయితే మటుకు పట్టపగలు. అదీకాక నల్గురు తిరిగే యిల్లు..

ఏ ఆడది మాత్రం సహకరిస్తుంది?

ఏమి ఎరుగనట్టు తువ్వాలు భుజాన వేస్కొని బావివేపు నడిచాడు అమాయికంగా శంకరం.

కుంకుడు పులుసు పితుకుతూ కోపంగా చూసింది అతనికేసి. ఏమీ పట్టించుకోకుండా కింద పీట మీద కూర్చున్నాడు.



పులుసు నెత్తిమీద పోస్తూ-

''మీరు వేళాపాళా లేకుండా చిన్నపిల్లోడిలా ప్రవర్తిస్తున్నారండీ''

''ఏం చేశాను''

''మీకు తెలియదా?''

''ఏం చేయను మరి..నాకేమో ఎప్పుడూ అదుండాలి. అది లేకుండా క్షణం కూడా నేను భరించలేను.''

''దానికి హద్దు పొద్దు వుంటుందండి. ఎవరన్నా చూస్తే ఎగతాళి మనకే.''

''అంటే..ఈ నాలుగురోజులూ పస్తు లేనా?'' డీలాగా అన్నాడు.

''మిమ్మల్నేమీ పస్తులుంచను. కాకపోతే పగలు మాత్రం పస్తులుండక తప్పదు''

స్నానం అయ్యాక తలతుడుచుకుంటూ ఎండలో నుంచున్నాడు శంకరం.

పక్కింటికెళ్ళి రన్నింగ్ రేస్ ప్రాక్టీస్‌లో పాల్గొనేవాడిలా శంకరం వేపు దూసుకుపోయాడు వెంకి.

''ఏంట్రా..ఆ పరుగు!''

''ఈ పరుగు యిప్పటికి కాదు బావా..ఎప్పటిదో..అందాక ఎందుకు పి.టి. ఉషకి రన్నింగ్ నేర్పిందెవరనుకుంటున్నావ్? నేను. అలానే అశ్వనీ నాచప్పకి రన్నింగ్ నేర్పిందెవరనుకుంటున్నావ్? నేను. అట్లాగే...'' అని ఏదో అనేలోపే శంకరం అడ్డుకున్నాడు.

''ఒరేయ్...ఒరేయ్..అది సరే గాని..ఈరోజు భోగి కదా ఎక్కడ చూసినా భోగిమంటలు కన్పించవేంట్రా!''

''అదా నీ డౌటు'' కొసంత పొడవున సాగదీసి ''ఈ ఊళ్ళో నేను వన్ ఫార్టీ ఫోర్ సెక్షన్ అమలు చేశాను. దాని ఫలితమే ఈ భోగిమంటలు రద్దయ్యాయి. లేకపోతే తాటాకు గుడిసెలు కనబడితే చాలు..పీక్కుని భోగిమంటలు వేసుకుంటు

న్నారు. ప్రజల శ్రేయస్సుకోరి నా హెల్ప్ వాళ్ళకందించా ననమాట''

''నీ మాటకి ఊళ్ళో అంత వాల్యూ వుందా?''

''ఎంత మాట బావా..ఈ వెంకిని ఎంత తక్కువంచనా వేశావ్! వేస్ట్-వేస్ట్..ఈ ఊళ్ళో నా పరువు వేస్ట్'' అంటూ నొసలి మీద కుడి చేసి అడ్డుపెట్టుకొని ఎంతో బాధపడుతున్న ట్టుగా బిల్డప్ యిచ్చాడు.

''ఏవండి టిఫిన్''

తలతిప్పి చూశాడు శంకరం.

వెంకి కూడా పక్కకు తల తిప్పాడు.

''బాబోయ్ అక్క'' అనుకొని ''బావా తర్వాత మాట్లాడ్దాం'' అంటూ యింట్లోకి ఒక్క పరుగు.

''నువ్వు చేశావా''

''లేదు''

''యిద్దరం కల్సే చేద్దాంగా''

''నాకు బోల్డంత పనుంది. ముందు మీరు కానివ్వండి''

''పని చేయడానికి మీ అమ్ముందిగా!''

''అమ్మ ఒకతే ఎలా చేసుకుంటుం దండి!'' జాలిగా అంది.

''అంటే..మొగుడ్ని ఒంటరిగా వదిలే సినా బాధ లేదు గాని..అమ్మకు మాత్రం తోడుంటానంటావ్. సర్లే వెళ్ళు'' వెటకా రంగా అన్నాడు.

''అర్థం చేసుకోండి'' కళ్ళను గీటింది.

''అర్థం చేసుకున్నాను కాబట్టే టిఫిన్ పెట్టమనేది'' బెట్టుగా అన్నాడు.

''అయితే రండి!'' నొక్కి అంది.


''పదా వస్తున్నా'' అంటూ గదిలోకి వెళ్ళాడు శంకరం.

★★★

ఆ మర్నాడు సంక్రాంతి.

''అమ్మా గాయత్రి..కొత్త పండక్కి మీ యిద్దరికి కొత్త బట్టలు పెట్టలేని అసమర్థత వచ్చిందమ్మా ఈ ఏడు. పంటలన్నీ కొట్టుకు పోవడంతో నేతికి సిల్లిగవ్వకూడా రాలేదు. కాకపోతే కన్న తండ్రిగా పండక్కి పిలవాల న్పించింది. నాది తప్పంటావమ్మా?'' బొంగురు గొంతుతో అన్నాడు రామయ్య.

''నాన్నా! నువ్వింతగా బాధపడాల్సిన పన్లేదు. నువేదో చేస్తావని మేము యిక్కడికా రాలేదు. మీ అల్లుడుగారు ఎప్పుడు కూడా యిటువంటివి ఆలోచించరు. పండగంటే సంవత్సరంలో వచ్చేవి కాదు నాన్న పండ గలు. కష్టసుఖాలు అందరూ కల్సి సమంగా పంచుకున్నప్పుడే నిజమైన




పండుగ వస్తుంది. ఈ సంవత్సరం పండగ మీ అల్లుడుగారి చేతుల్లోనే వుంది'' అనున యంగా అంది.

''గాయత్రి నువు అదృష్టజాతకురా లివే. నీకు అంత మంచి భర్త దొరికినం దుకు మాకు చీకు లేకుండా పోయింది'' అంది కూతురు తల నిమురుతూ సీత.

''మీ యిద్దరి దయవల్లే కదమ్మా నాకీ సంతోషం''

''అదేంటే..తల్లిదండ్రులుగా మా బాధ్యత నెరవేర్చాం''

తల్లిదండ్రులుగా మీ బాధ్యత తీరినా..కూతురుగా మిమ్మల్ని ఆదరించవ ల్సిన బాధ్యత నామీదుంది. మీ అల్లుడు గారు మీ అందర్నీ అక్కడికి వచ్చెయమను అని ఎన్నోసార్లు చెప్పారు. నాన్నకేమో ఉన్న ఊరి మీద మమకారం. తను ఊరు వదిలి రాడన్న సంగతి నాకు తెలుసు. అందుకే ఉత్త రంలో ఆ విషయం రాయట్లేదు. మీకు యిష్టమైతే..ఈసారి మనమంతా కల్సే ఉండొ చ్చమ్మా''

''వద్దులే తల్లి..అల్లుడుగోరు ఆ మాట న్నారు మాకదే పదివేలు. అల్లుడుగోర్కి మాపై పేమాభిమానాలు ఎల్లప్పు డుంటే..అంతకన్నా మాకేం కావాలి తల్లి''


''మరీ విషయం అల్లుడుగార్కి చెప్ప దెలా?'' అంది.

''నేనన్నీ విన్నాను'' అన్నాడు గుమ్మం వద్ద నుంచుని శంకరం.

తలతిప్పి చూసి హర్ట్ అయ్యారు రామయ్య, సీత.

''అదీ..మరీ..'' అంటూ జేవురించిన ముఖంతో ఏదో చెప్పాలని ప్రయత్నించాడు రామయ్య.

''మీరు ఏమి చెప్పక్కర్లేదు మావగారు. మీరేదో పెట్టారని ఆశించి మేము యిక్కడికి రాలేదు. పండగంటే నల్గురితో ఆనందం పంచుకుంటూ సరదాగా గడిపే రోజు. మీరు బట్టలు పెట్లేదని మాకు బాధలేదు. అసలు మేమే మీ అందరికీ బట్టలు తీసు



అన్నపూర్ణ (చిత్తూరు)

కొచ్చాం. ఈరోజు ఎవరి మొహంలో ఏడుపు నేను చూడకూడదు.

మీరు కూడా స్నానాలు చేసి గబగబ బట్టలు మార్చుకుంటే మనమంతా కల్సి గుడికెళ్దాం.

ఆ తర్వాత పిండివంటలు..భోజ నాలు..యిలా బోల్డన్ని పన్లున్నాయ్..రాత్రికి సెకండ్ షో సినిమా కూడా ఫిక్స్ చేసేశాను'' నవ్వుతూ చెప్పాడు.

''నువు నా అల్లుడు కాదయ్యా కొడు కివి. కొత్తగా పెళ్ళయిన కూతురికి అల్లుడికి కూతురేపు నుండి గుడ్డలెడ్డం సూసాను గాని..అల్లుడే కొడుకులా మారి గుడ్డలెడ్డం నిన్నే సూత్తన్నానయ్యా'' అంటూ అతని చెంపలు నిమిరాడు.

''మావగారూ..మీ ప్రేమానురాగాలే నాకు కొండంత ఆస్తులు. యింతకన్నా నాకేమి కావాలి''

''ఏమైనా యిలాంటల్లుడు అందరికీ దొరకడం సేనా కష్టం'' దీనంగా అన్నాడు.

''బావ ఈ సెంటిమెంట్ డైలాగ్స్ తోటే ఈ రోజు గడిచేలా వుందే?'' అన్నాడు వెంకి.

''బామర్ది నువ్వు చిన్నోడివి. నీకు చెప్పినా అర్థం కాదు''

''నాకన్నీ తెల్సుగాని..ముందు మీరంతా రడీ అవ్వండి. గుడికెళ్ళొచ్చాక తీరిగ్గా చెప్పుకోవచ్చు..వెళ్ళండి... వెళ్ళండి'' హడావిడి చేశాడు.

రామయ్య, సీత పక్క గదిలోకి వెళ్ళిపో యారు. వెంకి బయటకొచ్చేశాడు. ఆ గదిలో శంకరం, గాయత్రి మాత్రం ఒంట రిగా మిగిలిపోయారు.

భర్తకేసి మౌన చూపులు చూస్తూ గట్టిగా కౌగిలించుకుంది గాయత్రి.

''ఏమయింది గాయత్రి..ఊ..లే..''

''మీలాంటి మంచి మొగుడు దొరికినం దుకు...అదీగాక మా యింటి అల్లుడు అయినందుకు..నా కృతజ్ఞతలు''

అతన్ని తన ఎద ఎత్తులకు వొత్తుతూనే తలపైకెత్తి అంది వినమ్రంగా.

''భర్తకు భార్య యివ్వాల్సింది చుమ్మాలు, కృతజ్ఞతలు కాదు'' తన కౌగిలి లోనే వుంచి అన్నాడు కసిగా చూస్తూ.

పట్టరాని సంతోషంతో అతని బుగ్గపై గట్టిగా పెదాలతో ముద్దాడింది గాయత్రి. అమాంతం స్వర్గంలోకి జారిపోయాడు శంకరం.

★